తాగునీటికి కటకట

- కొంగరకలాన్‌లో నెలరోజులుగా అరకొర నీటి సరఫరా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఇబ్రహీంపట్నం రూరల్: వేసవికి ముందే తాగునీటి కటకట తప్పడం లేదు. ప్రజలు నెలల తరబడిగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇదీ ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ ప్రాంతంలోని పరిస్థితి. వివరాల్లోకి వెళ్తే.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో 6వేల మందికి పైగా జనాభా ఉంది. జిల్లా కలెక్టరేట్ పక్కనే ఉన్నటువంటి ఇంతటి ముఖ్యమైన ప్రాంతంలో తీవ్ర నీటి ఎద్దడి ఉంది. ఇక్కడి వార్డులకు సంబంధించి ఐదుమంది కౌన్సిలర్లు అనేకమార్లు నీటి ఎద్దడి విషయమై మున్సిపాలిటీ అధికారులకు, మిషన్ భగీరథ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చేసేదిలేక కొంతమంది కౌన్సిలర్లు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

కొంగరకలాన్ పట్టణానికి నీటి ఎద్దడిని తీర్చడంలో మిషన్ భగీరథ అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జనాభాకు అనుగుణంగా నీటిని సరఫరా చేయడం లేదనే విమర్శలుఉన్నాయి. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినప్పటికీ నీటి సమస్య తీరడం లేదని వాపోతున్నారు.


కొంగరకలాన్‌లో ట్యాంకర్లతో నీరు పట్టుకుంటున్న మహిళలు

నెలరోజులుగా నీళ్లు రావడం లేదు



నెలరోజులుగా కొంగరకలాన్‌లో తాగునీరు రావడం లేదు.ఫిల్టర్ నీరు కొనుగోలు చేసుకొని తాగాల్సి న దుస్థితి నెలకొంది. రోజూ వారి అవసరాలకు కూడా నీరు లేకుండా పోయింది. చైర్‌పర్సన్ మన ప్రాంతానికి సంబంధించిన వారే ఉన్నా సమస్య మాత్రం తీరడం లేదు. నీటి సమస్య తీర్చాలి.

– పద్మ, గృహిణి, కొంగరకలాన్

సమస్య పరిష్కరిస్తాం



కొంగరకలాన్‌లోని అన్ని వార్డుల్లో నీటి సమస్య ఉన్న మాట వాస్తవమే. నెలరోజులుగా సరిపడా తాగునీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు విన్నవించినా మిషన్ భగీరథ అధికారులు స్పందించడంలేదు. ఎమ్మెల్యేతో మాట్లాడి నీటి సమస్యకు పరిష్కారం చూపిస్తాం.

– వనం శ్రీనివాస్, కౌన్సిలర్

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: పరిపాలనా సౌలభ్యం కోసమే రాష్ట్ర ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి వాటికి ప్రత్యేక నిధులను విడుదల చేస్తోందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లి గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రామ సచివాలయం) గురువారం గ్రామ సర్పంచ్ కరిమెల వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నూతనంగా ఏర్పాటైన పంచాయతీలను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. ప్రజల సౌకర్యార్థం తమ గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణం చేపట్టాలంటూ పట్టుదలతో కృషి చేసిన సర్పంచ్ కరిమెల వెంకటేష్‌తో పాటు పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే మంచిరెడ్డి అభినందించారు. గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బింగి దాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అక్బర్ పాషా, ఉపసర్పంచ్ ఎంపీ ఫాతిమాబీ అఫ్సర్, మాజీ ఉపసర్పంచ్ తొర్పునూరి జగన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు,నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు, పట్టాల పంపిణీ..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలోని 77 మందికి 58 జీఓ కింద మంజూరైన పట్టాలను, 147 మందికి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను గురువారం బాలాజీ గార్డెన్‌లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటచారి, ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ మహిపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.


పంచాయతీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, నాయకులు

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలకు ట్రస్టు చేయూత

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో డబ్బులు లేక అసంపూర్తిగా నిలిచిపోయిన నిరుపేద కుటుంబాలకు చెందిన పలువురి ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. గ్రామానికి చెందిన జయమ్మ, మోనాజీ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి సిమెంట్, ఇసుక, ఇటుకను ట్రస్ట్ సభ్యుల ద్వారా గురువారం అందజేశారు. సింగిల్‌విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు రంగయ్య, రవి కుమార్, శేఖర్, రాములు, తిరుపతినాయక్, రమేశ్, పాండు, రాఘవేందర్, రాజు, రవి ఉన్నారు.

కొండ్రిగానిబోడ్ తండాలో కంటివెలుగు శిబిరం


కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్‌తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సేవ్యా భావోజీతో కలిసి జెడ్పీటీసీ ప్రారంభించారు. కంటి పరీక్షల కోసం ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్యులే గ్రామాల్లోకి వచ్చి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్త, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీడీఓ రామకృష్ణ, ఉప సర్పంచ్ శ్రీనునాయక్, డాక్టర్లు కిరణ్, సంపూర్ణ, నాయకులు రాజు, పరుశురాం, నరేశ్, గణేశ్, రంగా, కార్యదర్శి లింగారెడ్డి, ఆశ వర్కర్లు ఉన్నారు.

దర్గా నిర్మాణానికి విరాళం అందజేత


దర్గా నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

కడ్తాల్: మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామంలో దర్గా నిర్మాణానికి స్థానిక నాయకులు బోదాసు మహేశ్ రూ.3లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం దర్గా నిర్మాణ పనులకు గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మైనారిటీ నేతలు మహేశ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదగిరి, నాయకులు రాములు, జంగయ్య,శేఖర్, రాజు, కృష్ణ,ఫారుఖ్,ర ఫిక్,గౌసు తదితరులు ఉన్నారు.

హామీలు విస్మరించిన ప్రభుత్వాలను తరిమికొడదాం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి


జోడో యాత్రలో కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను విస్మరించాయని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని కరపత్రాలు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య, డబల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, దళితులకు 3 ఎకరాల భూమి తదితర హామీలన్నీ తుంగలో తొక్కిందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఎండీ.అజీం, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీం, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి రవీందర్, విష్ణుగౌడ్, సేవాదళ్ అధ్యక్షుడు దశరథం, రవి, రామకృష్ణ, శశిధర్‌రెడ్డి, సుజన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఆమనగల్లు: మాడ్గుల మండలం గిరికొత్తపల్లికి చెందిన మాధవికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం క్రింద రూ.19 వేలు, వెల్దండ మండలం పోతెపల్లికి చెందిన భీమయ్యకు రూ.1.50 లక్షలు, బాలమ్మకు రూ.20 వేలు, ప్రేమలతకు రూ.16 వేలు, మారమ్మకు రూ.28 వేలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కసిరెడ్డి నివాసంలో గురువారం లబ్ధిదారులకు కసిరెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఆమనగల్లు ఎంపీపీ అనిత, టీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, విజయ్, శ్రీనివాస్, వెంకటేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బీజేపీ నేత ఆచారి

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనలో గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం, హనుమాన్ జయంతిను పురస్కరించుకొని గ్రామ పంచాయతీ, హైదరాబాద్ కామినేని హాస్పిటల్, కమల్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు బీజేపీ సీనియర్ నేత ఆచారి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, ఎంపీఓ రఘు, వార్డు సభ్యులు రాణి, రాజు, వెంకటేశ్, కృష్ణవేణి, రేణుక, యాదయ్య, దామోదర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి పాండుప్రసాద్, నర్సింహా, ఎంపీటీసీ హేమరాజు, హైస్కూల్ చైర్మన్ జంగయ్య, భగవంతు, శాంతకుమారి, నవీన్, భానుప్రకాశ్, చంద్రమౌళి, కుమార్, శేఖర్, సత్తయ్య, వైద్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తిచేయండి: ఎంపీడీఓ

ఆమనగల్లు: గ్రామాల్లో చేపట్టిన ఈజీఎస్ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు సూచించారు. మాడ్గుల మండలం ఆర్కపల్లి, పల్గుతండాలో గురువారం ఎంపీడీఓ రాఘవులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో నర్సరీలు, డంపిగ్‌యార్డు, శ్మశానవాటిక, ప్రకృతి వనాలను ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలని సూచించారు. మొక్కల సంరక్షణ చేపట్టాలన్నారు.


ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాఘవులు

‘మాభూములు మాకివ్వండి’

మంచాల: అక్రమంగా కొనుగోలు చేసిన మా భూములు మాకు ఇవ్వాలని లోయపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం లోయపల్లి గ్రామంలో కొనసాగుతున్న ల్యాండ్ లెవలింగ్ పనులను వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా భూ బాధితులు మాట్లాడుతూ.. 2006లో ముదిరాజ్, గిరిజనులకు సంబంధించిన 368, 352, 329, 356 సర్వే నంబర్లలో 3659 ఎకరాలు ఆకుల రాజయ్య అగ్రిమెంట్ చేయించుకొని అక్రమంగా ఇతర కంపెనీలకు సేల్‌డీడ్ చేసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఈభూములను ఈడీకి అటాచ్ చేసింది. రైతులకు పూర్తిస్థాయిలో ఆనాడు డబ్బులు ఇవ్వకుండా నేడు కంపెనీల పేరుతో కబ్జా చేస్తున్నారని తెలిపారు. మాకు న్యాయం చేయకుండా కబ్జా చేస్తే ఆందోళన చేస్తామని బాధిత రైతులు పేర్కొంటున్నారు. కొంతమంది రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కబ్జాదారులకు వంతపాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- వాడీవేడిగా మంచాల సర్వసభ్య సమావేశం
- గత తీర్మానాలనే ఇప్పటివరకు పరిష్కరించలేదంటూ ఆగ్రహం
- గ్రామాల్లో సమస్యలపై సభ్యుల ఏకరువు

మంచాల: సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచాల మండల కార్యాలయంలో గురువారం ఎంపీపీ నర్మద అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వాడీవేడిగా సాగింది. గ్రామాల్లో శ్మశానవాటికల్లో బోరువేసిన వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని.. దీంతో బోర్లు నిరూపయోగంగా మారాయని తాళ్లపల్లిగూడ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశంలో మంచాల నుంచి చిత్తాపూర్ వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, బోడకొండలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని తీర్మానం చేసినప్పటికీ ఇంతవరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదని మండల కోఆప్షన్ సభ్యుడు వాజీద్ మండిపడ్డారు. కూరగాయ, పండ్ల తోటలకు సబ్సిడీపై డ్రిప్పులు ఇవ్వాలని మంచాల ఎంపీటీసీ సభ్యుడు ఎడ్మా నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గ్రామాల్లో కోతులు, కుక్కల బెడద విపరీతంగా ఉందని మంచాల, చిత్తాపూర్ సర్పంచ్‌లు అనిరెడ్డి జగన్‌రెడ్డి, బొడ్డు నాగరాజుగౌడ్ వాపోయ్యారు. తక్షణమే మండల సర్వ సభ్య సమావేశంలో తీర్మానం చేసి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నర్మద

తాగునీటి ఎద్దడిని తీర్చండి..

గ్రామాల్లో తాగు నీరు సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మంచాల సర్పంచ్ జగన్‌రెడ్డి, చీదేడ్ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి ఆరోపించారు. వారంలో రెండు రోజులు నీటి సరఫరా చేయడం లేదన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పేర్కొన్నారు. గ్రామాల్లో అర్హులందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని చీదేడ్ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి కోరారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి అన్నారు. గ్రామాల్లో ఆర్టీసీ బస్సులను ప్రయాణికులకు సమయానుకూలంగా నడిపించాలన్నారు. అనంతరం ఎంపీపీ నర్మద మాట్లాడుతూ.. సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకుపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, తహసీల్దార్ అనిత, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ తేజ్‌సింగ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

తపస్ జిల్లా అధ్యక్షుడు కాశీరావు


డీఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మంచాల: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఆసంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్ఓ హరిప్రియకు వినతి పత్రం అందజేశారు. ఏళ్లతరబడిగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ సంఘం జిల్లా అధ్యక్షుడు కాశీరావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్, కోశాధికారి కృష్ణ, నాయకులు.. శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు రవి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు బీజేపీ పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని ప్రధాన రోడ్డుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశారు. పదవ తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీలో అడ్డంగా దొరికిన బండి సంజయ్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఆకుల యాదగిరి, కర్నె అరవింద్, జెర్కొని రాజు, రాజ్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి, నాయకులు

పౌష్టికాహారం తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయమూర్తులు ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఇందిర, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, న్యాయవాదులు జగన్‌గౌడ్, మురళి, మాదన్న, రవికిరణ్, జగన్, నారాయణరెడ్డి, వెంకటేశ్, ధనంజయ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో న్యాయవాదులు

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి వేడుకలను గురువారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో, పట్టణాల్లో యువకులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. పలుచోట్ల అన్నదానాలు, మజ్జిగ పంపిణీ చేశారు. బైక్ ర్యాలీలు తీశారు. జైహనుమాన్, జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


ఆమనగల్లు: చంద్రాయణపల్లి తండా హనుమాన్ దేవాలయంలో..


ఆమనగల్లు: శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు, యువకులు


తలకొండపల్లి: శోభాయాత్రలో ఎమ్మెల్సీ కసిరెడ్డి తదితరులు


యాచారం: నల్లవెల్లి గ్రామంలో ..


కడ్తాల్: బైక్ ర్యాలీలో యువకులు


ఆమనగల్లు: బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


మంచాల: బీజేపీ జెండావిష్కరణలో మాజీ ఎంపీ బూర


యాచారం మండల కేంద్రంలో..

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కుటుంబపాలనకు చరమగీతం పాడి దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకే బీజేపీ ఆవిర్భవించిందని ఆ పార్టీ నేతలు తెలిపారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా బీజేపీ జెండాలను ఆవిష్కరించి సంబురాలు జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నియంత పాలనకు చరమగీతం పాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్